ప్రజాశక్తి

శనివారం 23 మార్చి 2024 5 విజయనగరం



పక్కాగా కంట్రోల్ రూమ్ నివేదికలు

ప్రజాశక్తి-విజయనగరం

కంట్రోల్ రూమ్ నుండి పంపే నివేదికలను వెనువెంటనే పక్కాగా పంపాలని జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. శుక్రవారం కలెక్టర్ కంట్రోల్ రూమ్ లోని అన్ని విభాగాలను తనిఖీ చేశారు. మీడియా మానటరింగ్ , సోషల్ మీడియా, 24/7 కాల్ సెంటర్, ఎంసిసి విభాగం, రిపోర్టింగ్ విభాగాలను తనిఖీ చేసి అక్కడి సిబ్బందితో వారి విధుల పై వివరాలు అడిగారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనకు సంబంధించిన సంఘటనలు, ఇతర అంశాలపై ఫిర్యాదుల స్వీకరణకు కలెక్టరేట్ కంట్రోల్ రూములో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి కాల్ సెంటర్ నంబర్లు 08922-797120, 08922-797124 సంప్రదించి తమ ఓటు వివరాలను తెలుసుకోవచ్చునని కలెక్టర్ తెలిపారు. కలెక్టర్‌తో జె.సి కార్తీక్, సి పిఒ బాలాజీ, జెడ్‌పి సిఇఒ రాజ్ కుమార్, జిఎస్‌డబ్ల్యు ఎస్ కో ఆర్డినేటర్ నిర్మలా దేవి, ఎంసిసి నోడల్ అధికారి అరుణశ్రీ, డి పి ఆర్‌ఒ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కోళ్లకే అవకాశం

- ఎట్టకేలకు ఎస్.కోట టిడిపి అభ్యర్థి ప్రకటన
- గొంప క్రిష్ణకు నిరాశ
- రాష్ట్ర కార్యదర్శి పదవికి రాజీనామా

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి/శృంగవరపుకోట

శృంగవరపుకోట టిడిపి అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారికి అవకాశం దక్కింది. అధిష్టానం ఎట్టకేలకు శుక్రవారం ఆమె పేరును ప్రకటించింది. దీంతో, చాలా కాలంగా సీటు ఆశించి, కోళ్లకు పోటీగా పార్టీ కార్యక్రమాలు, సామాజిక కార్యక్రమాలు చేపట్టిన గొంప క్రిష్ణ కంగుతిన్నారు. తీవ్ర మనస్థాపానికి గురైన ఆయన టిడిపి రాష్ట్ర కార్యదర్శి పదవికి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. ఇదే నియోజకవర్గం నుంచి స్వతంత్రంగా పోటీచేయనున్నట్టుగా కూడా ప్రకటించారు. భవిష్యత్తు పరిణామాలు ఎలా ఉంటాయో వేచి చూడాల్సివుంది. అభ్యర్థి లలిత కుమారి గతంలో 2 సార్లు ఎమ్మెల్యేగాను, ఒకసారి టిటిడి బోర్డు మెంబర్‌గాను పనిచేశారు. తాత కీర్తిశేషులు కోళ్ల అప్పలనాయుడు ఏడుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందగా, టిడిపి నుంచి రెండుసార్లు ఎన్నికయ్యారు. దేవాదాయ శాఖ మంత్రిగా సేవలందించారు. అదే వారసత్వంతో రాజకీయాల్లోకి లలితకుమారి వచ్చారు. ఈనేపథ్యంలో మరోసారి టిడిపి అధిష్టానం పోటీకి అవకాశం కల్పించింది.

వాస్తవానికి రెండేళ్ల క్రితం వరకు గొంప క్రిష్ణ విదేశాల నుంచి టిడిపి సహకరించారు. ఆ తరువాత టిడిపి రాష్ట్రనేతలే జిల్లాకు తీసుకొచ్చి ఎస్.కోట ఎమ్మెల్యే సీటుపై ఆశలు కల్పించారు. దీంతో, లలిత కుమారితో సమాంతరంగా కార్యక్రమాలు చేయడంతో చంద్రబాబు, లోకేష్ నియోజకవర్గ పర్యటనలతో లలిత కుమారితో సమానంగా ప్రాధాన్యతనిచ్చి స్టేజిలు కూడా ఎక్కించారు. దీంతో, క్రిష్ణతోపాటు ఆయన అనుయాయుల్లో ఆశలు పెరిగాయి. చివరకు టిక్కెట్ రాకపోవడంతో ఆయన అభిమానులు శుక్రవారం సాయంత్రం నిరసన తెలిపారు. ముఖ్యంగా వేపాడ మండలంలో నిరసనలు పెల్లుబికాయి.

లలితకుమారి నేపథ్యం

కోళ్ల లలితకుమారి కుటుంబం 50 ఏళ్లగా రాజకీయాల్లో ఉన్నారు. ఆమె తాత కోళ్ల అప్పలనాయుడు టిడిపి ఆవిర్భావం నుంచి ఐదుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అంతకుముందు స్వతంత్రంగా రెండుసార్లు గెలిచారు. ఆయన వారసత్వాన్ని అందిపుచ్చుకున్న లలితకుమారి ఎస్.కోట నియోజకవర్గం నుంచి 2009, 2014లో ఎమ్మెల్యేగా గెలుపొందారు. తాజా ఎన్నికలతో టిడిపి ఆధ్వర్యాన పదో సారి ఆ కుటుంబానికి ప్రాధాన్యత కల్పించినట్లు అయ్యింది.

గొంప క్రిష్ణ కార్యాలయంపై టిడిపి గుర్తులను చెరిపేస్తున్న అనుచరులు

భగ్గుమన్న గొంప గ్రూపు

- టిడిపి పదవులకు రాజీనామా
- ఇండిపెండెంట్‌గా పోటీకి సిద్ధం

ప్రజాశక్తి-శృంగవరపుకోట, వేపాడ

శృంగవరపుకోట ఎమ్మెల్యే టికెట్‌ను కోళ్ల లలితకుమారికి కేటాయిస్తూ టిడిపి అధిష్టానం నిర్ణయంపై గొంప క్రిష్ణ గ్రూపు భగ్గుమంది. టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణతోపాటు ఆయన గ్రూపు నాయకులంతా తమ పార్టీ పదవులకు రాజీనామాలు చేశారు. శుక్రవారం శృంగవరపుకోటలోని పార్టీ కార్యాలయంలో గొంప క్రిష్ణ తన అనుచరులతో సమావేశమయ్యారు. అందులో రాష్ట్ర కార్యదర్శి పదవికి గొంప క్రిష్ణ రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. ఆయనతోపాటు టిడిపి వేపాడ మండల అధ్యక్షులు గొంప వెంకటరావు, కొత్తవలస మండల అధ్యక్షులు గొరపల్లి రాము, జామి మండల అధ్యక్షులు లగుడు రవికుమార్, విశాఖ పార్లమెంట్ ఉపాధ్యక్షులు రాయవరపు చంద్రశేఖర్, తెలుగు మహిళా నియోజకవర్గ అధ్యక్షురాలు గుమ్మడి భారతి.. వారి పదవులకు రాజీనామా చేశారు.

ఈ సందర్భంగా గొంప క్రిష్ణ మాట్లాడుతూ కార్యకర్తల సూచనల మేరకు ఇండిపెండెంట్‌గానైనా పోటీ చేస్తానని ప్రకటించారు. ఎన్నారై గా ఉద్యోగం చేసుకున్న తనను ఎస్ కోట ఎమ్మెల్యే టికెట్ ఆశ చూపి నారా లోకేష్, విశాఖ ఎంపి అభ్యర్థి భరత్ ఎస్.కోట నియోజకవర్గానికి తీసుకువచ్చారని తెలిపారు. నిన్నటివరకు టిక్కెట్ ఇస్తామని చెప్పి చివరకు అధిష్టానం దెబ్బకొట్టడం సరైనది కాదని నాయకులంతా అన్నారు. ఇండిపెండెంట్‌గా పోటీ చేయాలని నాయకులంతా కోరడంతో గొంప క్రిష్ణ ఈ మేరకు పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు.

చీపురుపల్లిపైనే అందరి చూపు

ఇక్కడి అభ్యర్థి తేలితేనే భీమిలి, ఎచ్చెర్లలో క్లారిటీ • టిడిపిలో కొలిక్కిరాని అభ్యర్థుల ఎంపిక

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

> సాధారణంగా ఎన్నికల్లో ఫలితాల గురించి జనం ఆద్యంతం ఆసక్తికరంగా ఎదురు చూడడం సర్వసాధారణం. కానీ, ప్రస్తుతం చీపురుపల్లి టిడిపి అభ్యర్థి ఎవరనేదానిపై అదేరకమైన ఉత్కంఠ నెలకొంది. ఈ స్థానంతో శ్రీకాకుళం, విశాఖపట్నం జిల్లాల్లో చెరొకటి చొప్పన రెండు నియోజకవర్గాల అభ్యర్థుల ఎంపిక ఆధారపడి ఉండడమే ఇందుకు కారణం. ఈనేపథ్యంలో చీపురుపల్లి టిడిపి శ్రేణులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నాయి.

వైసిపిలో అత్యంత కీలక నేతగా ఉన్న రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చీపురుపల్లి నుంచి పోటీకి దిగుతున్న విషయం విధితమే. ఆయన వైసిపి జిల్లా రాజకీయాలను ఒంటిచేత్తో నడిపిస్తున్న నేత అనడంలో అతిశయోక్తి కాదు. ఎన్నికల్లో ఎత్తుకు పైఎత్తులేడంలో ఆయన దిట్ట. బహుశా అందుకేనేమో సిట్టింగ్ ఎమ్మెల్యేలకే తిరిగి అవకాశం కల్పించాలన్న బొత్స విజ్ఞప్తిని సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మారు మాట అడకుండా అంగీకరించారు. ఈ ఎన్నికల్లో కేవలం ఉమ్మడి విజయనగరం జిల్లాకే కాకుండా విశాఖ పార్లమెంట్ పరిధిలోనూ ప్రచారం చేసే అవకాశాలు ఉన్నాయి. ఈనేపథ్యంలో ఆయన ప్రభావాన్ని తగ్గించాలంటే చీపురుపల్లిలో తగిన గెలుపు గుర్రాన్ని దింపాలని టిడిపి భావించడం, అందుకు మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావును రంగంలోకి దింపాలని ఆలోచించడం తెలిసిందే. ఇందుకు గంటా తొలుత తటపటాయించినప్పటికీ చివరకు తాడోపేడో అంటూ చీపురుపల్లివైపు దారి తీశారట. విశాఖ పార్లమెంట్ స్థానం అభ్యర్థిగా పోటీకి దిగుతున్న ఎం.భరత్ భీమిలిలో గంటాను దింపితే తన గెలుపు సునాయాశంగా ఉంటుందని భావిస్తున్నారట. ఈనేపథ్యంలో గంటా స్థానం ఎక్కడ అనేది అధిష్టానం ఇంకా పెండింగ్‌లో పెట్టింది. టిడిపి అధినేత చంద్రబాబు మాత్రం గంటాను చీపురుపల్లి పంపేందుకే మొగ్గు చూపుతున్నట్టు సమాచారం. జిల్లాలోని అశోక్ వంటి సీనియర్లు పోటీలో లేని నేపథ్యంలో గంటా వంటి సమర్ధవంతమైన నాయకుడు అవసరమని భావిస్తున్నారట. మొత్తానికి గంటా ఎక్కడనేది తేలితే తప్ప చీపురుపల్లి, అటు శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల, విశాఖ జిల్లా భీమునిపట్నం నియోజకవర్గాల్లో అభ్యర్థులు ఎవరనేది స్పష్టత వచ్చే అవకాశం లేదు. దీంతో, ఉత్తరాంధ్ర జిల్లాల్లో చీపురుపల్లి అసెంబ్లీ అభ్యర్థి, గంటా స్థానంపై జనం ఆశక్తికరంగా చర్చించుకుంటున్నారు. మరోవైపు శుక్రవారం టిడిపి విడుదల చేసిన అభ్యర్థుల జాబితాలో ఎస్.కోట నుంచి మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారికి అవకాశం దక్కినప్పటికీ, పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ అభ్యర్థిత్వం ఇంకా పెండింగ్‌లోనూ ఉంది. పాలకొండ కన్నా అందరి చూపూ చీపురుపల్లి రాజకీయాలపైనే కనిపిస్తోంది.

జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలకు ముగ్గురు ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 25, 26, 27, 28 తేదీలలో రాజమండ్రిలో జిఎస్ ఎల్ మెడికల్ కాలేజ్‌లో జరుగు 25వ జాతీయస్థాయి సబ్ జూనియర్ ఫెన్సింగ్ ఛాంపియన్‌షిప్‌కు విజయనగరం జిల్లా నుండి ముగ్గురు క్రీడాకారులు ఎంపికయ్యారు. రాష్ట్రంలో జాతీయస్థాయి ఫెన్సింగ్ పోటీలు జరగడం జరగడం ఇదే ప్రథమం. గత ఏడాది డిసెంబర్ 8, 9, 10 తేదీల్లో విజయనగరం రాజీవ్ స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని విజయనగరానికి చెందిన బి .సాయి చైతన్య, పార్వతీపురానికి చెందిన కోట హర్షిత, కె.హిత విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా క్రీడాకారులు డిప్యూటీ కోలగట్ల వీరభద్ర స్వామిని కలవగా ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఫెన్సింగ్ చీఫ్ కోచ్ డివి చారి ప్రసాద్, జిల్లా కోచ్‌లు అనిల్ కుమార్ శర్మ, ఎం.సతీష్ కుమార్, పి. అప్పలరాజు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

ప్రజాశక్తి-తెర్లాం

మండలంలోని రాజాం- రామభద్రపురం మార్గంలో పెరుమాళి సమీపంలో ఎస్ఐ రమేష్ ఆధ్వర్యాన శుక్రవారం వాహన తనిఖీలు చేపట్టారు. కార్లు, జీపులు, ఆటోలను ఆపి తనిఖీ నిర్వహించారు. కార్యక్రమంలో పోలీసులు సిబ్బంది ఉన్నారు.

ఓటమి భయంతోనే కేజ్రీవాల్ అక్రమ అరెస్ట్

సిపిఎం, ఆమ్‌ఆద్మీ, కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాస్తారోకో

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి భయంతోనే ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్‌ను బిజెపి ప్రభుత్వం అక్రమంగా అరెస్ట్ చేయించిందని, ఇది ప్రజాస్వామ్యానికి చీకటి రోజని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కె.దయానంద్, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రెడ్డి శంకరరావు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుంకరి సతీష్ అన్నారు. కేజ్రీవాల్ అరెస్ట్‌ను ఖండిస్తూ శుక్రవారం స్థానిక ఆర్టీసి కాంప్లెక్స్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లిక్కర్ కేసులో ఒక్క రూపాయి కూడా అవినీతి జరిగినట్లు దర్యాప్తు సంస్థలు నిరూపించలేకపోయాయని, ఈ కేసులో ఇప్పటికే ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా, ఎంపీ సంజయ్ సింగ్ లను అరెస్ట్ చేసినా బిజెపితో రాజీ పడకపోవడం వల్లనే చివరికి సిఎం కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేసిందని అన్నారు. మోడీ పాలనలో అవినీతి, అక్రమాలు, అత్యాచారాలు చేసినవారు, బ్యాంకులకు ఎగనామం పెట్టి ప్రజల సొమ్ముతో విదేశాలు పారిపోయినవారికి రక్షణ ఉందని, నిజాయితీ పాలన చేస్తున్న ఆప్ నేతలను, విపక్షాలను వేధింపులకు గురి చేస్తుందని ఆవేదన చెందారు. తమను ఎంతగా వేదించినా బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడుతూనే ఉంటామని అన్నారు. కేజ్రీవాల్ ను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేసారు. కార్యక్రమంలో ఆప్ నాయకులు పూసపాటి ప్రతాప్ వర్మ, అనిల్, బూరాడ శ్రీనివాస్, పి. సురేష్, తిప్పాన కోటేశ్వరరావు, నయీమ్, టివి నర్సింహులు, కిలాని శ్రీనులతో పాటు కాంగ్రెస్, సిపిఎం కార్యకర్తలు పాల్గొన్నారు.

రాస్తారోకో చేస్తున్న సిపిఎం, ఆమ్‌ఆద్మీ, కాంగ్రెస్ నాయకులు

ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై కేసులు

నేటి వరకు 12 కేసులు నమోదు : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం

ఎన్నికల కమిషన్ సూచనల మేరకు ఎన్నికల నియమావళి ఉల్లంఘించిన వారి పై కేసులను నమోదు చేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. జిల్లాలో శుక్రవారం వరకు 12 ఉల్లంఘన కేసులను నమోదు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఇందులో ఎస్.కోట నియోజకవర్గానికి చెందినవి 3 కేసులు, రాజాం నియోజకవర్గానికి చెందినవి రెండు కేసులు, నెల్లిమర్ల నియోజకవర్గానికి చెందినవి 2 కేసులు , చీపురుపల్లి, బొబ్బిలి నియోజకవర్గాలకు చెందినవి ఒక్కొక్కటి కాగా విజయనగరం నియోజకవర్గానికి చెందినవి 3 కేసులను పోలీస్ లు నమోదు చేసినట్లు తెలిపారు. వీటిలో అనుమతులు లేకుండా ప్రచారం చేపట్టినవి, ఓటర్ల ను ప్రలోభ పెట్టేలా వస్తు పంపిణీలు, మద్యం బాటిళ్ళు పంపిణీ, కొత్తగా పనులు ప్రారంభించినందుకు జరిగిన ఉల్లంఘనలకు సంబంధించి కేసులను నమోదు చేసినట్లు తెలిపారు.

రవాణా వాహనాలపై రాజకీయ ఫొటోలు, పోస్టర్లు ఉండరాదు

ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున జిల్లాలో అన్ని రవాణా వాహన యజమానులు ఖచ్చితంగా ఎన్నికల నియమావళి పాటించాలని కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. రవాణా వాహనాల పై రాజకీయ సంబంధమైన ఫోటోలు, పోస్టర్లు, స్టికర్లు ఉండరాదని , వాహనాల పై ఫోటోలు, పోస్టర్లు ఉంటే అటువంటి వాహనాల పై కేసు లు నమోదు చేసి వాహనాలను సీజ్ చేస్తామని తెలిపారు.

ఐదుగురు వాలంటీర్లు తొలగింపు

ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి, రాజకీయ పార్టీల కార్యక్రమాల్లో పాల్గొన్న ఐదుగురు వాలంటీర్లపై వేటు పడింది. రాజకీయ పార్టీ సమావేశంలో పాల్గొన్న గరివిడి మండలం చుక్కవలసకు చెందిన దబ్బాక వెంకటలక్ష్మి, పార్టీ ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్న విజయనగరం అద్దేపల్లివారి వీధికి చెందిన గురజాపు చంద్రశేఖర్, గంగి మురళి, కుప్ప గురుమూర్తి, బసవ రాజును విధులనుంచి తొలగిస్తూ జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు.

చింతలవలసలో దొంగల బీభత్సం

వరుస దొంగతనాలతో జనాల్లో ఆందోళన

ప్రజాశక్తి -డెంకాడ

జిల్లాలో వరుస దొంగతనాలతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. రామభద్రపురం, భోగాపురంతోపాటు డెంకాడ మండలంలోని చింతవలస, ఐదో బెటాలియన్ ఎదురుగా ఉన్న సత్యనారాయణపురంలో మూడు రోజుల వ్యవధిలో రెండు దొంగతనాలు జరగడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గురువారం రాత్రి మండలంలో చింతలవలస గ్రామంలో ఎవరూ లేని ఇంట్లో దొంగలు చొరబడి ఇంటిని చిందరవందర చేశారు.

చింతలవలసలో బి.జగన్మోహనరావు అనే ఉద్యోగ విరమణ పొంది, గ్రామంలో ఇల్లు నిర్మించుకొని తన భార్యతో జీవిస్తున్నాడు. వారి కుమారుడు హైదరాబాద్‌లో ఉండడంతో భార్య అక్కడికి వెళ్లి, అక్కడే మరణించింది. దీంతో జగన్మోహనరావు హైదరాబాద్ వెళ్లాడు. ఈ విషయాన్ని గమనించిన దొంగలు డోర్‌కు మిషన్ ద్వారా రంధ్రాలు వేసి, తాళాలు విరగ్గొట్టి లోపలికి ప్రవేశించారు ఇంట్లో ఉన్న మూడు బెడ్ రూముల్లో కబోర్డులు, బీరువాల్లోని దుస్తులు, సామగ్రిని చిందరవందరగా పారేశారు. ఏమీ దొరక్క పోవడంతో బయటకు వెళ్లిపోయారు. సమీపంలో ఉన్న వారు ఉదయం ఇంటి తలుపులు తీసి ఉండటంతో విశాఖలో ఉంటున్న జగన్మోహన్‌రావు కుమార్తెకు సమాచారం అందించారు. దీంతో అల్లుడు శ్రీనివాస్ కుమార్ ఇంటికి చేరుకున్నాడు. మామయ్య జగన్మోహన్ రావుకు సమాచారం ఇచ్చాడు. ఇంట్లో ఎటువంటి నగదు, బంగారం చోరీ కాలేదని తెలిపాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని, ఆధారాలను సేకరించారు డెంకాడ ఎస్ఐ కృష్ణమూర్తి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చోరీయత్నం జరిగింది ఈ ఇంట్లోనే..

వ్యాగన్ కేంద్రాన్ని కొనసాగించాలని నిరసన

ప్రజాశక్తి-బొబ్బిలి

రైల్వే స్టేషన్లో వ్యాగన్ లోడింగ్, అన్ లోడింగ్ కేంద్రాన్ని వేరే ప్రాంతానికి తరలిస్తే రైలు పట్టాలపై బైఠాయించి ఆందోళన చేస్తామని పట్టణ కళాసీ సంఘం కార్యదర్శి డి.వర్మ అన్నారు. వ్యాగన్ కేంద్రాన్ని కొనసాగించాలని శుక్రవారం రైల్వే స్టేషన్ వద్ద నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాగన్ కేంద్రంలో 500 మంది కళాసీలు పనిచేస్తూ జీవనోపాధి పొందుతున్నారని తెలిపారు. వ్యాగన్ కేంద్రాన్ని ఇతర ప్రాంతానికి తరలిస్తే వారంతా ఉపాధి కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యాగన్ కేంద్రాన్ని కొనసాగించాలని భువనేశ్వర్‌లో రైల్వే జనరల్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశామని చెప్పారు. వ్యాగన్ కేంద్రాన్ని బొబ్బిలిలో కొనసాగించాలని డిమాండ్ చేశారు. లేదంటే పోరాటం ఉధృతం చేస్తామన్నారు. కళాసీల పోరాటానికి సిఐటియు జిల్లా నాయకులు ఎస్.గోపాలం మద్దతు ప్రకటించారు.

కార్యక్రమంలో కళాసీ సంఘం నాయకులు, కళాసీలు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న కళాసీలు

మాధవికే మద్దతు

- ఆత్మీయ సమావేశంలో టిడిపి నేతలు
- బంగార్రాజుతోపాటు భోగాపురం నాయకులు డుమ్మా

ప్రజాశక్తి-డెంకాడ, పూసపాటిరేగ

పొత్తులో భాగంగా జనసేన పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి లోకం మాధవికే తమ మద్దతని టిడిపి నెల్లిమర్ల నియోజకవర్గ నాయకులు ప్రకటించారు. టిడిపి, జనసేన, బిజెపి ఆత్మీయ సమావేశాలను శుక్రవారం డెంకాడలో టిడిపి కార్యాలయంలో, పూసపాటిరేగ మండలంలో మాజీ మంత్రి పతివాడ స్వగృహంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీమంత్రి పతివాడ నారాయణస్వామి నాయుడు, సీనియర్ నాయకులు మహంతి చిన్నంనాయుడు, కంది చంద్రశేఖరరావు, పతివాడ అప్పలనారాయణ, సువ్వాడ రవిశేఖర్ మాట్లాడారు. ఉమ్మడి అభ్యర్థి గెలుపు కోసం టిడిపి కార్యకర్త నుంచి నాయకుడి వరకు కృషి చేయాలని తెలిపారు. పూసపాటిరేగ మండల నాయకులు పతివాడ తమ్మునాయుడు మాట్లాడుతూ వైసిపి నుంచి జనసేన పార్టీలో చేర్చుకునేటప్పుడు టిడిపి స్థానిక నాయకులకు చెప్పి పార్టీలో చేర్చుకుంటే బాగుంటుందని అభిప్రాయ పడ్డారు. లేకుంటే కొత్తగా వచ్చినవారి పెత్తనం పెరుగుతుందన్నారు.

ఈ సమావేశాల్లో టిడిపి మూడు మండలాల అధ్యక్షులు, మాజీ, ప్రస్తుత ప్రజాప్రతినిధులు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ మంత్రి పతివాడ నారాయణ స్వామినాయుడు

బంగార్రాజు డుమ్మా

ఆత్మీయ సమావేశానికి టిడిపి నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌ఛార్జి కర్రోతు బంగార్రాజు డుమ్మా కొట్టారు. బంగార్రాజుతో సహా భోగాపురం మండల నాయకులు సమావేశానికి గైర్హాజరయ్యారు. పూసపాటిరేగ మండలానికి చెందిన టిడిపి రాష్ట్ర కార్యదర్శులు దంగా భూలోకా, మైలపల్లి సింహాచలం, జిల్లా ఉపాధ్యక్షులు ఆకిరి ప్రసాదరావు, రెల్లివలస సర్పంచి భర్త ఈశ్వర్రావు, కనిమెట్ట సర్పంచి ప్రతినిధి గోవిందరావు ఈ సమావేశానికి రాలేదు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి కర్రోతుకు అధిష్టానం నుండి ఎటువంటి హామీ రాకపోవడంతో జనసేనతో ఆత్మీయ సమావేశాలు ఆపాలని బంగార్రాజు నియోజకవర్గంలో నాయకులను కోరినట్లు తెలిసింది. అయితే దానికి డెంకాడ, పూసపాటిరేగ మండలాలకు చెందిన టిడిపి నేతలు నిరాకరించినట్లు సమాచారం. దీంతో సమావేశానికి వెళ్లొద్దని కొంతమందికి బంగ్రారాజు చెప్పినట్లు బోగట్టా.

విద్యారంగ సమస్యలపై పోరాటమే భగత్‌సింగ్‌కు నివాళి

ప్రజాశక్తి-బొబ్బిలి

విద్యారంగ సమస్యల పరిష్కారానికి చేసే పోరాటమే భగత్‌సింగ్‌కు ఘనమైన నివాళి అని యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.విజయగౌరి అన్నారు. స్థానిక శ్రీ శిరిడిసాయి డిగ్రీ కళాశాలలో భగత్ సింగ్ వర్ధంతి నిర్వహించారు. భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ కీలకపాత్ర పోషించారన్నారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యను కాషాయీకరణ చేస్తున్నారన్నారు. మతోన్మాదులు, కార్పొరేట్ సంస్థల నుంచి విద్యా రంగాన్ని కాపాడుకునేందుకు చేసిన పోరాటమే వారికి నిజమైన నివాళి అన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విజయగౌరి, విద్యార్థులు

ప్రజాశక్తి
www.prajasakti.com

మాట్లాడుతున్న సమతా విభాగం కన్వీనర్ నిర్మల

నీటిని పొదుపుగా వాడండి

ప్రజాశక్తి-డెంకాడ

నీటిని పొదుపుగా వినియోగించి, పర్యావరణాన్ని రక్షించాలని జనవిజ్ఞాన వేదిక సమతా విభాగం కన్వీనర్ నిర్మల కోరారు. ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా పినతాడివాడ పాఠశాలలో విద్యార్థులకు నీటి ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణాన్ని కలుషితం కాకుండా చూడడం, మొక్కలు నాటడం, నీటి వనరులను సద్వినియోగం చేసుకోవడం ద్వారా భవిష్యత్తు తరాలకు నీరు అందుబాటులో ఉండే విధంగా చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాజశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఐక్యంగా పనిచేయాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జనసేన, టిడిపి, బిజెపి కూటమి అభ్యర్థుల విజయం కోసం ఐక్యంగా పని చేయాలని జనసేన బొబ్బిలి, పార్వతీపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జులు గిరడ అప్పలస్వామి, ఆదాడ మోహన్ కోరారు. జనసేన కార్యాలయంలో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ బొబ్బిలి నియోజకవర్గంలో బేబినాయన, పార్వతీపురం నియోజకవర్గంలో విజయచంద్ర గెలుపునకు జనసైనికులు ఐక్యంగా పని చేయాలన్నారు. బొబ్బిలి నియోజకవర్గంలో జనసేన రాష్ట్ర ప్రచార కార్యదర్శి అని చెప్పుకుని తిరుగుతున్నారని, వారికి ఎటువంటి పదవులూ లేవని తెలిపారు. జనసైనికుల వివరాలను నకిలీ నాయకులు సేకరిస్తున్నారని, ఎవరికీ సమాచారం ఇవ్వవద్దని సూచించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు పి.మనోజ్ కుమార్, వీరమహిళ వి.దివ్య తదితరులు పాల్గొన్నారు.

రికార్డులు పరిశీలిస్తున్న గురుకులాల కోఆర్డినేటర్ పద్మజ

గురుకులాన్ని సందర్శించిన కోఆర్డినేటర్

ప్రజాశక్తి-వేపాడ

స్థానిక గురుకుల పాఠశాలను శుక్రవారం గురుకులాల జిల్లా కోఆర్డినేటర్ టి.పద్మజ సందర్శించారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి, పరీక్షలు ఎలా రాస్తున్నారోనని అడిగి తెలుసుకున్నారు. రాబోయే పరీక్షలకు ఎలా సన్నద్ధమవ్వాలో వివరించారు. అనంతరం మెస్‌లో భోజనాలు పరిశీలించి సంతృప్తి చెందారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ఉషారాణి, టీచర్ లక్ష్మి పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో విద్యార్థుల నమోదు తప్పనిసరి

ప్రజాశక్తి-నెల్లిమర్ల

ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థులను ఆన్‌లైన్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని ఎంఇఒ-2 ఈశ్వ విజయకుమార్ అన్నారు. శుక్రవారం నగర పంచాయతీలో 11వ వార్డులో శ్రీఆదిత్య పబ్లిక్ పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అడ్మిషన్ రిజిస్టర్, అడ్మిషన్ రికార్డ్, విద్యార్థుల హాజరు పట్టికను, సిఎస్‌ఇ రిజిస్టర్లో మార్పులు, ఉపాధ్యాయుల వివరాలను పరిశీలించారు. ప్రయివేట్ పాఠశాలలో తప్పనిసరిగా విద్యార్థులను అడ్మిషన్ చేసుకునేటప్పుడు బర్త్ సర్టిఫికెట్, విద్యార్థి, తల్లిదండ్రుల ఆధార్ కార్డులు, ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్, రికార్డ్ షీట్ ద్వారా అడ్మిషన్ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వి.అమృత, ఉపాధ్యాయులు ఎస్‌కె బేగం పాల్గొన్నారు.

సరిహద్దు ప్రాంతంలో ప్రత్యేక నిఘా

ప్రజాశక్తి - కొమరాడ

ఎన్నికల నేపథ్యంలో ఆంధ్ర - ఒడిశా సరిహద్దు ప్రాంతంలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని తహశీల్దార్ రమేష్ అన్నారు. శుక్రవారం ఆంధ్రా - ఒడిస్సా సరిహద్దు ప్రాంతమైన కూనేరు అంతర్రాష్ట్ర రహదారిపై రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో చెక్ గేట్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు అక్రమ మద్యం, నగదు, ఇతర వస్తువులు రవాణా జరగకుండా చర్యలు చేపడుతున్నామని అన్నారు. ఒడిశా నుంచి ఆంధ్రాలోకి వచ్చే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామన్నారు. అంతర్రాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో ఏర్పాటు చేసిన చెక్‌గేట్ వద్ద 24 గంటలు అధికారుల నిఘా వ్యవస్థలో ఉంటారని అన్నారు. సి-సేటు వద్ద తనిఖీల్లో భాగంగా ముగ్గురు అధికారులతో పాటు వివిధ శాఖ అధికారులను నియమించినట్లు తెలిపారు. ఈ చెక్‌గేట్ వద్ద ఉప తహశీల్దార్ శివయ్య, ఆర్ఐ శ్రీనివాసరావు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

విద్యుత్ సమస్య పరిష్కరించాలని నిరసన

ప్రజాశక్తి - వీరఘట్టం

తమ గ్రామంలో విద్యుత్తు సమస్య పరిష్కరించాలని మండలంలోని నడుకూరు గ్రామస్తులు శుక్రవారం విద్యుత్ ట్రాన్స్‌కో కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఇక్కడ ఇచ్చే ట్రాన్స్‌ఫార్మర్ల వ్యవసాయ మోటార్లకు కనెక్షన్ ఇవ్వడంతో గ్రామంలోని సుమారు 100 ఇళ్లకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీంతో విద్యుత్ లేక తాము ఇబ్బందులు పడుతుంటే పాటు రోగాల బారిన కూడా పడుతున్నట్లు వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో డ్రైనేజ్ ఉన్నప్పటికీ ఏ విధమైన సమస్యలు పరిష్కరించడం లేదని, గ్రామంలో విద్యుత్‌పై అవగాహన ఉన్న వ్యక్తి ట్రాన్స్‌కో కార్యాలయానికి ఫోన్ చేసి గ్రామానికి రావాలని విద్యుత్ మరమ్మతులు చేపడుతున్నట్లు తెలిపారు. తక్షణమే సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఉపాధి బిల్లులు చెల్లించాలి

ప్రజాశక్తి - సీతానగరం

ఉపాధి హామీ కూలీలకు వేతనాలు తక్షణమే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి రెడ్డి ఈశ్వరరావు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆర్.లక్ష్మునాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఎపిఒ ఎ.భానును కలిసి మాట్లాడారు. మండలంలోని నిడగల్లు, బగ్గందొరవలస కు చెందిన ఉపాధి కూలీలకు గత నాలుగు వారాలుగా ఉపాధి పనులకు బిల్లులు చెల్లించకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అంతేకాక నిడగల్లులో వికలాంగుల గ్రూపులకు చెందిన ఉపాధి కూలీలకు వేతనాలు రాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే అధికారులు స్పందించి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. దీనికి ఎపిఒ స్పందిస్తూ త్వరగా బిల్లులేల్లేలా చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో ఉపాధి కూలీలు రాయిపల్లి భాస్కరరావు, నక్క త్రినాధరావు, నక్క ఆనంద్, జాడ రాము తదితరులు పాల్గొన్నారు.

చినబోగిలిలో క్రాష్ ప్రోగ్రాం

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని చినబోగిలిలో క్రాష్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో వాడుకలో ఉన్న, వేసవిలో పనిచేయకుండా ఉన్న మంచినీటి బోర్లు మరమ్మతులు చేపట్టారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని నీటి ఎద్దడి నివారించేందుకు ఈ గ్రామస్తుల కార్యక్రమం జరుగుతుందని ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ బోర్ మెకానిక్ సత్యనారాయణ, పి.సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

తాగునీటి సరఫరా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ రామలక్ష్మి

ప్రజాశక్తి-బొబ్బిలి

వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి అన్నారు. శుక్రవారం మండలంలోని భోజరాజపురం వద్ద మున్సిపల్ ప్రధాన తాగునీటి సరఫరా కేంద్రాన్ని కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవిలో తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడకుండా చూడాలన్నారు. మోటార్ల పని విధానాన్ని ఇంజినీరింగ్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వేగావతి నదిలో ఉన్న మూడు ఇన్‌ఫిల్టరేషన్ బావులను సందర్శించి అందులో ఉన్న మోటార్ల పనితీరును అడిగి తెలుసుకున్నారు. గ్యాలరీ వెల్‌ను, బోర్లను పరిశీలించి బోర్డర్లో ఉన్న మోటార్లకు ఏమైనా మరమ్మతులు ఉన్నాయో గుర్తించి వాటికి మరమ్మతులు చేయించి రిజర్వులో ఉంచుకోవాలని ఆదేశించారు. 100 హెచ్‌పి, 30 హెచ్‌పి మోటార్లను, ఎలక్ట్రిక్ లైన్లను పరిశీలించి ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తుగా మరమ్మతులు చేయించుకోవాలని ఆదేశించారు. క్లోరినేషన్ నిల్వలను పరిశీలించారు. పట్టణంలో ఉన్న వివిధ ప్రాంతాల్లో లీకులను గుర్తించి వాటిని వెంటనే అరికట్టాలని ఆదేశించారు.

ప్రస్తుతం ఉన్న నీటి నిల్వలు, మోటార్ల పనితీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఉన్న నీటి నిల్వలు సరిపడినంతగా ఉన్నందున రానున్న రెండు నెలల్లో తాగునీటి సరఫరాకు ఆటంకం ఏర్పడకుండా చూడాలని ఆదేశించారు. ఆమెతో మున్సిపల్ డిఇ రవికుమార్, ఎఇ సురేష్ ఉన్నారు.

అంకితభావంతో పనిచేయాలి

ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

ప్రజాశక్తి-బొండపల్లి

రానున్న ఎన్నికలలో వైసిపి విజయానికి కార్యకర్తలు అంకితభావంతో పని చేయాలని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య కోరారు. శుక్రవారం మండలంలోని గొట్లాం గ్రామంలోని సత్యా కళ్యాణ మండపంలో మండల స్థాయి వైసిపి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. వైసిపి మండల అధ్యక్షులు బొద్దల చిన్నంనాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే సంక్షేమ పథకాలు అందించిన ఘనత సిఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని అన్నారు. గ్రామస్థాయిలో సంక్షేమ పథకాలు పొందిన లబ్ధిదారులను గుర్తించి వారిని పోలింగ్ బూత్‌లకు తరలించే బాధ్యతలను పార్టీ శ్రేణులు తీసుకోవాలని కోరారు. రానున్న ఎన్నికలు రాష్ట్ర భవిష్యత్తుకు అత్యంత కీలకమని, ఈ విషయాన్ని ప్రజలకు వివరించాలని సూచించారు. మరిన్ని సంక్షేమ పథకాలు ప్రజలకు అందాలంటే మళ్లీ జగనే ముఖ్యమంత్రి కావాల్సిన అవసరాన్ని అన్ని వర్గాల ప్రజలకు పార్టీ శ్రేణులు వివరించాలని కోరారు.

సమావేశంలో ఎమ్మెల్సీ సురేష్‌బాబు, ఎంపిపి చల్ల చలంనాయుడు, పీరుబండి హైమావతి, ఎఎంసి చైర్మన్ వేమలి ముత్యాలునాయుడు, పిఎసిఎస్ అధ్యక్షులు బివి.ప్రభూజీ, మహంతి రమణ, గొల్లు సతీష్, వైసిపి బోడసింగి జగదీశ్వర రావు, సీనియర్ నాయకులు మీసాల తులసీ రావు, ఈదిబిల్లి కృష్ణ, మాజీ ఎంపిపి బండారు బంగారం, బొత్స గురునాయుడు తదితరులు పాల్గొన్నారు.


పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి లోకం మాధవి

పార్టీలో చేరొద్దని వైసిపి బెదిరింపులు

జనసేన నెల్లిమర్ల ఎమ్మెల్యే అభ్యర్థి లోకం మాధవి

ప్రజాశక్తి-భోగాపురం

జనసేన పార్టీలో చేరవద్దని వైసిపి నాయకులు బెదిరింపులకు పాల్పడుతున్నారని జనసేన, టిడిపి ఉమ్మడి అభ్యర్థి లోకం మాధవి ఆరోపించారు. స్థానిక జనసేన కార్యాలయంలో పూసపాటిరేగ మండలం కందివలస, కనిమెట్ట పంచాయతీలకు చెందిన నాయకులు నక్కాన రమణ, పులపా రాధా కృష్ణమూర్తి, జలపాల శ్రీనుతోపాటు పలు కుటుంబాలు శుక్రవారం జనసేన పార్టీలో చేరాయి. వారికి లోకం మాధవి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసిపి నాయకులతో విసుగు చెంది చాలామంది జనసేన పార్టీలో చేరేందుకు ముందుకు వస్తున్నారని తెలిపారు. వైసిపి నాయకులు వారిని అడ్డుకునేందుకు నానా ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. వారు ఎన్ని అడ్డంకులు సృష్టించినా కూటమి కచ్చితంగా అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తంచేశారు. ఎమ్మెల్యేను కచ్చితంగా ఇంటికి పంపించే తీరుతామన్నారు. కార్యక్రమంలో నాయకులు కాకర్లపూడి శ్రీనివాసరాజు, పతివాడ శ్రీనివాసరావు, వరపుల సుధాకర్, పల్లంట్ల శ్రీనివాసరావు, జగదీష్, పళ్ళ రాంబాబు పాల్గొన్నారు.

కోలగట్ల ఎన్నికల ప్రచారం

ప్రచారం చేపడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయగనరం వైసిపి అభ్యర్థి, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. శుక్రవారం 5వ డివిజన్ బాబా మెట్టలోని ద్వారకా నగర్ నుంచి ప్రారంభించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ప్రజలకు అందుతున్న సంక్షేమాన్ని గుర్తు చేస్తూ ఓట్లను అభ్యర్థించారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అందించిన సంక్షేమం, నగరంలో తాను చేసిన అభివృద్ధి, అందుబాటులో ఉండడం, అవినీతి లేకుండా పాలన సాగించడం, కరోనా సమయంలో చేసిన సేవలను గుర్తించి మరోసారి తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి నగర అధ్యక్షుడు ఆసపు వేణు, ఫ్లోర్ లీడర్ ఎస్‌వివి రాజేష్, రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి మండలి డైరెక్టర్ బంగారనాయుడు, స్థానిక కార్పొరేటర్ గాదం మురళి, వైసిపి నాయకులు ఈశ్వర్ కౌశిక్, బొద్దాన అప్పారావు, బోడసింగి ఈశ్వరరావు, కార్పొరేటర్ ఆల్తి సత్యకుమారి, కెవిపి రాజు, కోరాడ సూర్య ప్రభావతి, పొంతపల్లి గోపి తదితరులు పాల్గొన్నారు.

పండగల్లో ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించొద్దు

ప్రజాశక్తి-భోగాపురం

అమ్మవారి పండగల్లో ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించవద్దని తహశీల్దార్ పి.శ్యామ్‌ప్రసాద్ ఉత్సవ కమిటీలకు తెలియజేశారు. భోగాపురం, పోలిపల్లి, లింగాలవలస గ్రామాల్లో ఈ నెల 25వ తేదీ నుంచి అమ్మవారి పండగలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఆయా గ్రామాల ఉత్సవ కమిటీ సభ్యులు, రాజకీయ నాయకులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ఉన్నందున గ్రామాల్లో రాజకీయ నాయకులకు సంబంధించిన ఫొటోలు, బ్యానర్లు, పేర్లు ఎక్కడా ప్రచురించవద్దన్నారు. ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు నిర్వహించుకోవాలని సూచించారు. సిఐ రవికుమార్ మాట్లాడుతూ పండుగల్లో అశ్లీల నృత్యాలు ప్రదర్శించరాదని ఆదేశించారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడవద్దని తెలిపారు. ఎన్నికల నియమావళి, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ చంద్రకళ, తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా ఎంసిసి అమలు

ప్రజాశక్తి-నెల్లిమర్ల

ఎన్నికల్లో ఎంసిసి పక్కాగా అమలు కావాలని ఎంపిడిఒ జి.రామారావు అన్నారు. శుక్రవారం మండలంలోని పారసాం, చిన, పెద బూరాడపేట గ్రామాల్లో ఎన్నికల సందర్భంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ గ్రామాల్లో అనుమతి లేకుండా ఎటువంటి ప్రచారాలు చేయరాదని చెప్పారు. ప్రలోభాలకు పాల్పడ వద్దన్నారు. ఎన్నికల నియమావళి అమల్లో నిర్లక్ష్యం చేయరాదని తెలిపారు.

నగర పంచాయతీలో ఎంసిసి పక్కాగా అమలు చేయాలని కమిషనర్ పి.బాలాజీ ప్రసాద్ సూచించారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో వార్డు పరిపాలన, ప్లానింగ్, శానిటేషన్ కార్యదర్శులు, విఆర్‌ఒలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాల్లో, కార్యాలయాల్లో రాజకీయ పార్టీలకు చెందిన బేనర్లు, పోస్టర్లు, స్టిక్కర్లు, జెండాలు తొలగించాలని ఆదేశాలు జారీచేశారు.

జాగ్రత్తలతోనే టిబి నివారణ

ప్రజాశక్తి-బొబ్బిలి

జాగ్రత్తలతోనే టిబి వ్యాధిని నివారించవచ్చునని టిబి యూనిట్ సూపర్‌వైజర్ ఆర్.శ్రీదేవి అన్నారు. టిబి వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం గ్రోత్ సెంటర్లోని విక్టోరియా ఫెర్రో పరిశ్రమలో టిబి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం ఉన్నా, కఫంతో రక్తపు జీరలు పడినా, క్రమంగా బరువు తగ్గినా, చాతిలో నొప్పి వచ్చినా టిబి పరీక్షలు చేసుకోవాలన్నారు. టిబి నివారణకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

గుండెపోటుతో హోంగార్డు మృతి

ప్రజాశక్తి-బొబ్బిలి

గుండెపోటుతో హోంగార్డు కెంగువ మహేష్ శుక్రవారం మృతి చెందారు. పట్టణంలోని మంగళవీధికి చెందిన మహేష్ తమ్ముడు రామారావు రోడ్డు ప్రమాదంలో మూడు రోజుల క్రితం మరణించాడు. సోదరుడు మరణంతో ఒత్తిడికి లోనైన మహేష్ తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మూడు రోజుల వ్యవధిలో అన్నదమ్ములు మరణించడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. మంగళవీధిలో విషాదఛాయలు అలుముకున్నాయి.

పలు ప్రాంతాల్లో పోలీసు కవాతు

కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లా ఎస్‌పి ఎం.దీపిక ఆదేశాలతో శుక్రవారం టూ టౌన్ పోలీసు స్టేషను పరిధిలోని పూల్ బాగ్, ఖాదర్ నగర్, బాబామెట్ట, దాసన్నపేట ప్రాంతాల్లో ఎస్ఐ కె.రామారావు, రాజేష్ ఆధ్వర్యాన పోలీసు కవాతు నిర్వహించారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు చేపట్టిన ముందస్తు చర్యల్లో భాగంగా పట్టణంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించి, శాంతియుతంగా ఎన్నికల నిర్వహణకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తుల సమాచారం అందించాలన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి-గంట్యాడ

మండలంలోని కొండతామరాపల్లి, గంట్యాడ, తాటిపూడి పోలింగ్ కేంద్రాలను తహశీల్దార్ నీలకంఠేశ్వరరెడ్డి శుక్రవారం పరిశీలించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రమైన కొండ తామరపల్లి పోలింగ్ కేంద్రాలను ఎస్ఐతో కలిసి పరిశీలించి, సిబ్బందికి సూచనలు చేశారు.

ప్రచారానికి అనుమతి తీసుకోవాల్సిందే

ఆర్‌డిఒ శాంతి

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ శాంతి

ప్రజాశక్తి-చీపురుపల్లి

ఇంటింటికి ప్రచారం చేసినా అనుమతి తీసుకోవాల్సిందేనని చీపురుపల్లి ఆర్‌డిఒ బి.శాంతి స్పష్టం చేశారు. శుక్రవారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. సాధారణ ఎన్నికలకు సంబంధించి ప్రతీ రాజకీయ పార్టీ ఎన్నికల నియమావళిని తూచ తప్పకుండా పాటించాలన్నారు. పోటీలో ఉండే ఏ పార్టీ అభ్యర్థులైనా వారి సభలు, సమావేశాలు, ప్రచారాలకు సంబంధించి అనుమతులు పొందేందుకు వారం రోజుల ముందుగా సువిధ యాప్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గ్రామాల్లో ఇంటింటి ప్రచారం, కరపత్రాల పంపిణీ, బ్యానర్లు, జెండాలు కట్టినా అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని చెప్పారు. ఉద్యోగులు ఎవరైనా ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. నియోజకవర్గంలో 160 లొకేషన్లలో 257 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. సమావేశంలో చీపురుపల్లి తహశీల్దారు ఎన్.సురేష్, సిఐ సిహెచ్ షణ్ముఖరావు పాల్గొన్నారు.

ఐక్యంగా పనిచేస్తే గెలుపు తథ్యం

టిడిపి గజపతినగరం ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీనివాస్

మాట్లాడుతున్న టిడిపి గజపతినగరం ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీనివాస్

ప్రజాశక్తి-గజపతినగరం

రానున్న ఎన్నికల్లో ఐక్యంగా పనిచేస్తే గెలుపు నల్లేరుపై నడకేనని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని గంగచోళ్లపెంట గ్రామంలో టిడిపి మండల అధ్యక్షులు అట్టాడ లక్ష్మునాయుడు అధ్యక్షతన పార్టీ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఇప్పుడున్న పరిస్థితుల్లో రాష్ట్రానికి టిడిపి, జనసేన, బిజెపి కూటమి ప్రభుత్వం అవసరమని చెప్పారు. లేకుంటే ఆంధ్ర రాష్ట్రం అధోగతి పాలవుతుందని తెలిపారు. ఈ సందర్భంగా మండలంలో వివిధ గ్రామాల నుంచి వైసిపి నుంచి 100 కుటుంబాలు టిడిపిలో చేరాయి. కార్యక్రమంలో ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవులు, జనసేన పిఎసి సభ్యులు పడాల అరుణ, మాజీ ఎంపిపి గంట్యాడ శ్రీదేవి, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వినాయక ప్రతిష్ట

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని నీలకంఠ రాజపురం గ్రామంలో వరసిద్ధి వినాయక ప్రతిష్ట కార్యక్రమాలు శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా గ్రామంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు. చిన్నారులతో కోలాటం, డాన్స్ బేబీ డాన్స్, ముగ్గుల పోటీలు నిర్వహించారు.

ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత

ప్రజాశక్తి-తెర్లాం

ప్రజా సంక్షేమానికి, అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ఎంపిపి ఎం.ఉమాలక్ష్మి, వైస్ ఎంపిపి సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. గత ఐదేళ్లలో అనేక రకాలైన సంక్షేమ పథకాలను ప్రజలకు అందించామన్నారు. సచివాలయ వ్యవస్థను ఏర్పాటుచేసి, ప్రజల వద్దకే పాలన తీసుకొచ్చామని చెప్పారు. 40 ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకుని, అడ్డంగా దోచుకుని, ప్రజలకు ఏ ఒక్క మంచి పని చేయని నాయకులు ఇప్పుడు మరిన్ని దొంగ హామీలతో వస్తున్నారని, అప్రమత్తంగా ఉండాలని కోరారు.

నేరాలు ఘోరాలు

చెరకుతోట దగ్ధం

ప్రజాశక్తి-బాడంగి

మండలంలోని పి.వెంకంపేట గ్రామంలో శుక్రవారం ఐదు ఎకరాల్లో చెరకు తోట దగ్ధమైంది. గ్రామానికి చెందిన పూడి శంకర్‌రావు, గంగరాజు, లక్ష్మణ, అప్పలనాయుడు, కృష్ణ, తదితరులకు చెందిన ఐదు ఎకరాల చెరకు తోటకు నిప్పంటుకుని మంటలు చెలరేగాయి. గ్రామస్తులు మంటలను ఆర్పేందుకు ప్రయత్నం చేసి విఫలమయ్యారు. పంట పూర్తిగా కాలిపోయిందని, ప్రభుత్వ సాయం అందించాలని బాధిత రైతులు కోరారు. ప్రమాదానికి కారణాలు తెలియలేదు. పూర్తిగా కాలిపోయాక ఫైర్ సిబ్బంది అక్కడికి చేరుకున్నారు.

పోలీసుల అదుపులో ఉన్న నిందితులు (ముసుగు ధరించిన వ్యక్తులు)

నిందితులు అరెస్టు

ప్రజాశక్తి-విజయనగరం కోట

నగరంలోని తోటపాలెం ఎయిమ్ స్కూలు వెనుక భాగంలో ఈనెల 21న పశువులను మేపుతున్న ఒక వృద్ధురాలి మెడలో చైను దొంగిలించిన ఇద్దరు నిందితులను 24 గంటలు గడవక ముందే అరెస్టు చేసి, దొంగిలించిన బంగారు చైను, రెండు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు వన్‌టౌన్ సిఐ బి.వెంకట్రావు తెలిపారు. తోటపాలేనికి చెందిన బంక గురుమూర్తమ్మ (60) ఎయిమ్స్ స్కూల్ వెనుక భాగంలో పశువులను మేపుతుండగా అక్కడకు వచ్చిన ఒక అపరిచిత వ్యక్తి ఆమె యోగ క్షేమాలు అడుగుతున్నట్లుగా మాట్లాడి, చుట్టు ప్రక్కల ఎవ్వరూ లేరని గమనించి ఆమె మెడలో చైను లాగుకొని, కొద్ది దూరంలో ఉన్న మరొక వ్యక్తి మోటారు సైకిల్‌పై పరారయ్యాడు. దీంతో ఆమె వన్ టౌన్ పోలీసులే స్టేషనులో ఫిర్యాదు చేయగా నేరానికి పాల్పడిన ఇద్దరు నిందితులను పూసపాటిరేగ చాకలివీధికి చెందిన మామిడి సత్య కుమార్, గురాన భార్గవ్‌గా గుర్తించారు. విచారణలో నిందితులు ఫిబ్రవరి మాసంలో వెంకటేశ్వర స్వామి కోవెల సమీపంలో ఇదే తరహా నేరానికి పాల్పడినట్లు అంగీకరించారని ఇన్స్పెక్టర్ బి.వెంకటరావు తెలిపారు. ఈ కేసులో వన్‌టౌన్ ఎస్ఐ జే.తారకేశ్వరరావు, హెడ్ కానిస్టేబుల్ ఎం.అచ్చిరాజు, కానిస్టేబుళ్ల శివ, గౌరీశంకర్ క్రియాశీలకంగా పనిచేశారని సిఐ అభినందించారు.